ముత్యాల ముగ్గు మురిసింది. సంక్రాంతి పండుగను వారం రోజుల ముందే అతివలు తమ రంగవల్లులతో స్వాగతం పలికారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సౌజన్యంతో లోకల్ స్పాన్సర్ల సహకారంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మొత్తం 239 మంది మహిళలు హాజరై ఉత్సాహంగా ముగ్గులేశారు.





జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు విజేత ఎం.విద్య (తిరుపతి)

తిరుపతిలో...





రెండో బహుమతి తీసుకుంటున్న కె.లోకేశ్వరి





మూడో బహుమతి అందుకుంటున్న సీహెచ్ అనూరాధ

- మహిళల కళాసృజనకు పట్టం గట్టిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి

మురిసిన ముత్యాల ముగ్గు





తిరుపతిలో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న మహిళలు

- తిరుపతి, చిత్తూరు, మదనపల్లెల్లో విరిసిన రంగవల్లులు
- వారం ముందే సంక్రాంతి సందడి

ఆంధ్రజ్యోతి, తిరుపతి: తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగిన ముగ్గుల పోటీల్లో 87 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరవగా, న్యాయనిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.యువశ్రీ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ బి.తేజోవాణి వ్యవహరించారు. ఎం.విద్య (కొర్లగుంట), కె.లోకేశ్వరి (భవాని నగర్), సీహెచ్ అనూరాధ (సత్యనారాయణపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ముఖ్యఅతిథితో పాటు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సైకం జయచంద్రారెడ్డి, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులను బాలాజీ మొబైల్స్ అధినేత, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి వాచీలు అందజేశారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ శుభమస్తు అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ప్రత్యేక కానుకలు అందజేశారు.

చిత్తూరు: చిత్తూరులోని ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణమండపంల జరిగిన ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. లోకల్ స్పాన్సర్‌గా విజయం విద్యాసంస్థలు వ్యవహరించాయి. కార్పొరేషన్ కమిషనర్ అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజ, సావిత్రమ్మ డిగ్రీ కాలేజ్ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ జి.ఉషారాణి, పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కాలేజ్ అధ్యాపకురాలు మమత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డి.బుజ్జిరావు (లక్ష్మీనగర్ కాలనీ), వి.పొన్నియమ్మ (ఎంజీఆర్‌వీధి), ఎ.రాణి (శంకరయ్యగుంట) వరుసగా అందుకున్నారు. వీరికి ముఖ్య అతిథితో పాటు న్యాయ నిర్ణేతలు బహుమతులను ప్రదానం చేశారు.

మదనపల్లె: మదనపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ముగ్గుల పోటీలకు 76 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఈ పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరించారు. డి.వి.పూర్ణ, ఎస్.పద్మ, బి.మల్లిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వీరికి ముఖ్య అతిథి, మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి, శ్రీనివాసడిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి, న్యాయనిర్ణేతలు మోహన్‌వల్లి, ఉషారాణి బహుమతులు అందజేశారు.

చిత్తూరులో...





మొదటి బహుమతి అందుకుంటున్న బుజ్జిరావు





రెండో బహుమతి తీసుకుంటున్న పొన్నియమ్మ





మూడో బహుమతి అందుకుంటున్న రాణి

మదనపల్లెలో...





మొదటి బహుమతి అందుకుంటున్న డి.వి.పూర్ణ





రెండో బహుమతి తీసుకుంటున్న ఎస్.పద్మ





తృతీయ బహుమతి అందుకుంటున్న బి.మల్లిక

ఇదేం బరితెగింపు..!

- నదిలోకి దర్జాగా రోడ్డు ఏర్పాటు
- భారీ యంత్రాలు పెట్టి మట్టి, ఇసుక తరలించేసిన అధికార పార్టీ నేతలు
- శ్రీకాళహస్తిలో స్వర్ణమ్మ శోకం

శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ నేతలు అక్రమాలతో చెలరేగిపోతున్నారు. పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలోకి చొరబడి మట్టి, ఇసుకను కొల్లగొట్టారు. భారీ యంత్రాలు, టిప్పర్లతో బాహాటంగా తవ్వకాలు చేయడాన్ని చూసిన వారంతా ఇదేం బరితెగింపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తి జనవరి 7: ముక్కంటి భక్తులు ఎంతో పవిత్రంగా ఆరాధించే స్వర్ణముఖి నదిలో ఎన్నో ఏళ్ల క్రితమే ఇసుక తవ్వకాలను నిషేధించారు. నిబంధనలతో తమకేం పని అనుకున్నారేమో.. కొందరు అధికార పార్టీ నేతలు ఏకంగా నదిలో అనధికారిక రోడ్డును నిర్మించారు. ఆపై ప్రైవేటు వెంచర్ కోసం నదిలోని మట్టి, ఇసుకను భారీ యంత్రాలతో దర్జాగా తవ్వి తరలించారు.

అధికారం అండతోనే..

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక నది ఒడ్డున ప్రైవేటు భూమి ఉంది. ఇందులో వెంచర్ వేయడానికి కొందరు అధికార పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. అధికారం అండగా ఉండడంతో.. ఎవరు అడ్డుకుంటారన్న ధీమాతో రెండ్రోజుల నుంచి క్రషర్ దుమ్ముతో నదిలోకి రోడ్డు వేశా రు. ఆదివారం భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. స్థానికుల సమాచారంతో ఆంధ్రజ్యోతి అక్కడికి వెళ్లి ఫొటోలు తీసింది. నదిలో మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రాల మధ్య ముక్కంటి ఆలయం రాజగోపురం కూడా స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆంధ్రజ్యోతి వచ్చిన విషయం తెలుసుకున్న అక్రమార్కులు వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు.



నదిలోకి అక్రమార్కులు వేసిన రోడ్డు



ప్రైవేటు స్థలంలోకి డంపింగ్

యంత్రాలతో జోరుగా తవ్వకాలు



యువతిని కత్తితో బెదిరించి దోపిడీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7: జాతీయ రహదారిలో నిర్మానుష్య ప్రాంతంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన యువతిని ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్లు కాజేసిన విషయంపై ఆదివారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్, రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరుకు చెందిన మాధవి తిరుపతిలోని ఓ పీజీ హాస్టల్లో ఉంటూ సీఏ కోర్సు చదువుతోంది. పుంగనూరుకు చెందిన సిమెంట్, స్టీల్ వ్యాపారి దేవకుమార్ శనివారం తిరుపతికి వచ్చి తిరుగు ప్రయాణంలో మాధవిని తనతోపాటు ఆయన కారులో తీసుకువెళ్లాడు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో వెళుతుండగా మాధవి వాష్‌రూమ్‌కి వెళ్లాలని చెప్పడంతో వకుళమాత ఆలయ సమీపంలో దేవకుమార్ కారును ఆపారు. ఆ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి మాధవి వెళ్లింది. ఇద్దరు దుండగులు మాధవి దగ్గరకు వెళ్లి కత్తితో బెదిరించి.. ఆమె వద్ద ఉన్న బంగారు ఉంగరాలు కాజేశారు. అంతటితో ఆగక ఆమెను కారు వద్దకు తీసుకొచ్చారు. అదే కారులో మాధవి, దేవకుమార్‌ను కిడ్నాప్ చేసి.. భారీ మొత్తంలో నగదు కాజేసేందుకు నేంద్రగుంటవైపు తీసుకెళ్లారు. కారు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే అందులో ఉన్న మాధవి కిందకు దూకేసి పెద్దగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు దుండగులు కారి దిగి పారిపోయారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దోపిడీకి పాల్పడినవారు 25 ఏళ్లలోపు యువకులుగా గుర్తించారు. వీరిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

23 మంది సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7: జిల్లాలో 23 మంది సీఐలు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలిలా..

వి.సుబ్రహ్మణ్యంరెడ్డి.. తిరుపతి రూరల్(ఎం.ఆర్‌పల్లె) నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, ఎస్.విక్రమ్.. బీఎన్ కండ్రిగ నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, వై.బాలకృష్ణ.. ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి నుంచి ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి ఐఈ, కె.రాజశేఖర్.. చంద్రగిరి నుంచి ఎస్‌బీ తిరుమలకు, పి.రామకృష్ణాచ్చారి.. ఎస్పీ, తిరుమల నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, కె.లక్ష్మీనారాయణ.. పుత్తూరు నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, బి.ప్రవీణ్ కుమార్.. సీసీఎస్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, బీవీ శివప్రసాద్ రెడ్డి.. తిరుచానూరు నుంచి ఎబీ్బ, తిరుపతికి, పి.సురేంద్రనాథ్ రెడ్డి.. భాకరాపేట నుంచి పీసీఆర్, తిరుపతికి, పి.జగన్మోహన్ రెడ్డి.. తిరుమల 1టౌన్ నుంచి డీటీసీ, తిరుపతికి, కె.వెంకటప్ప.. డీటీసీ, తిరుపతి నుంచి సీసీఎస్, తిరుపతికి, టి.చిరంజీవి రావు.. పీసీఆర్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, జి.అమర్‌నాథ్‌రెడ్డి .. సీసీఎస్, తిరుపతి నుంచి సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌కి, ఎన్.రవీంద్రనాథ్.. సీసీఎస్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, వి.శివప్రసాద్.. ట్రాఫిక్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, ఓ.రామచంద్రారెడ్డి.. సైబర్ క్రైమ్ నుంచి ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతికి, బి.నాగరాజు.. ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, బీవీ శ్రీనివాసులు.. వీఆర్ ఎస్పీ, తిరుపతినుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, ఎం.శ్రీనివాసులు.. ఎస్పీ, తిరుపతి నుంచి డీసీఆర్బీ, తిరుపతికి, ఆర్.ఎస్.మధుబాబు.. వీఆర్ ఎస్పీ, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, ఆర్.వినోద్ కుమార్.. వీఆర్ ఎస్పీ, తిరుపతి నుంచి సైబర్ క్రైమ్, తిరుపతికి, ఎం.భాస్కర్ నాయక్.. పుత్తూరు రూరల్ నుంచి సీఐ, పుత్తూరు రూరల్ ఐఈ, సీహెచ్ అంజూ యాదవ్.. శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి డీటీఆర్‌బీ, తిరుపతికి బదిలీ అయ్యారు.

ఎం.కొత్తపల్లె వద్ద స్కూటర్‌ను ఢీకొన్న కారు

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు




మృతి చెందిన కళ్యాణ్ చక్రవర్తి - తీవ్రంగా గాయపడిన నారాయణ

చంద్రగిరి, జనవరి 7: చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లె వద్ద ఆదివారం సాయంత్రం కారు స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ...భాకరాపేటకు చెందిన నారాయణ, కల్యాణ చక్రవర్తిలు స్కూటర్‌పై రామచంద్రాపురం మండలం, నూతగుంటపల్లెలో జరిగిన జల్లికట్టుకు హాజరై తిరిగి వెళుతుండగా, తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఎం.కొత్తపల్లె వద్ద ఢీకొంది. ఈప్రమాదంలో కల్యాణచక్రవర్తి, నారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కల్యాణ చక్రవర్తి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

స్పోర్ట్స్, ఫ్రెషర్స్ డేలో మోహన్‌బాబు



చంద్రగిరి, జనవరి7: ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని ఎంబీయూ చాన్సలర్ ఎం.మోహన్‌బాబు అన్నారు. ఆదివారం ఎ.రంగంపేట సమీపంలోని శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో 31వ క్రీడా దినోత్సవాన్ని, ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీనటుడు ప్రభుదేవా, ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, ప్రోచాన్సలర్ మంచు విష్ణు విచ్చేశారు. ఈ సందర్భంగా సినీనటుడు ప్రభుదేవా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలతోపాటు చదువుపై దృష్టి సారించి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసికోల్లాసమే కాకుండా శారీరక ధృడత్వం కలిగి ఉంటారని తెలిపారు. అనంతరం విద్యార్థుల క్రీడా విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం ఎంబీయూలో నూతనంగా చేరిన ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రభుదేవా నృత్యాలు చేసి, అందర్నీ అలరించాడు. ఎంబీయూ వీసీ నాగరాజరాంరావు, రిజిస్ట్రార్ సారధి, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లంకొండ మురళి

భాకరాపేట, జనవరి 7: గ్రామస్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లెలో ఆదివారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదనమోహన, మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, మోహన్ రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, కుమారస్వామి రెడ్డి, సుబ్రహ్మణ్యం, మనోహర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గురుమూర్తి, కుంతాటి మురళి, నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, మణికంఠ రెడ్డి, దేవరాజులు, అమరనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజయశేఖర్ గౌడ్, హనుమంతు రెడ్డి, వెంకటనాగిరెడ్డి, రాజగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



పాకాల, జనవరి 7: మండలంలోని చంద్రగిరివారిపల్లె, రమణయ్యగారిపల్లెలో ఆదివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. ఇంటింటికీ అయోధ్యరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్నామని ఆనందగిరి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బాబురెడ్డి, చిన్నారమ్మ, వంశీప్రియ పాల్గొన్నారు.

చంద్రగిరి మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం



చంద్రగిరి, జనవరి 7: చంద్రగిరి మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. చైర్మన్‌గా కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చేగు గోవర్ధన్‌గుప్తా, డైరెక్టర్లుగా దాసరయ్యగారి మమత, ఉమ్మడి సురేఖ, షేక్‌మహ్మద్ హుస్సేన్, తలారి సుజాత, పి.ఉమాదేవి, కె.రవీంద్రనాథ్‌రెడ్డి, సి.సరస్వతి, సి.మోహన్‌రెడ్డి, పి.మల్లికార్జునరెడ్డి, ఎస్.భావజాన్, కె.మధన్‌మోహన్‌రెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్, తిరుపతి అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తిలు ప్రమాణం స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే చంద్రగిరిలో మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజారు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు కార్యదర్శి జానకిరామయ్య, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఎంత బెదిరించినా ఉద్యమం ఆగదు

చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ల నిరసన



చంద్రగిరి, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీ వర్కర్ల సమ్మెను ఆపాలని ఎంత బెదిరించినా ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. ఆదివారం చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలిపిన కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా చట్టం ప్రయోగిస్తామని బెదిరిస్తే బెదరరని, వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక మృతి

- హత్యగా భావిస్తున్న మృతురాలి తల్లిదండ్రులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



బోరున విలపిస్తున్న మృతురాలి తల్లి



సోనికుమారి (ఫైల్ ఫొటో)



పులివర్తినానికి తన ఆవేదన చెబుతున్న మృతురాలి తండ్రి రాజేష్‌నాయక్



అనుమానితుడు బాలకిషోర్

చంద్రగిరి, జనవరి7: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో ఈనెల 2న అదృశమైన ఆరేళ్ల బాలిక.. సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం శవమై కనిపించింది. పోలీసుల కథనం మేరకు... జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీ కోసం జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులను పదిరోజుల క్రితం కాంట్రాక్టర్ మధుకర్ రెడ్డి పిలిపించారు. కార్మికులలో ఒకరైన రాజేష్‌నాయక్ తన కుమార్తె సోనికుమారి(6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకొంటూ కనిపించకుండా పోయిందని ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జగనన్న కాలనీ సమీప అటవీ ప్రాంతంలో సోనికుమారి మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. మృతురాలి తల్లి మాట్లాడుతూ తన కుమార్తె అదృశ్యమైన రోజున జార్ఖండ్‌కు చెందిన బాలకిషోర్‌పై అనుమానం వచ్చి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించామని చెప్పారు. అయితే పోలీసులు అతడిని వదిలిపెట్టేశారన్నారు. గత గురువారం బాలకిషోర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే తన కుమార్తె హత్యకు గురైందని ఆరోపించారు.

బాలిక మృతదేహాన్ని పరిశీలించిన పులివర్తి నాని

టీడీపీ నేత పులివర్తి నాని ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి బ్యాచ్ వల్లే ఈ దారుణం చోటు చేసుకుందని, చంద్రగిరి నియోజకవర్గం గంజాయి హబ్‌గా మారిందన్నారు. గంజాయి మత్తులోనే అభం శుభం తెలియని బాలికపై అత్యాచారం, హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. గతంలో చంద్రగిరిలో ఓ బాలికకు గంజాయి విక్రయిస్తూ ఎమ్మెల్యే బ్యాచ్ పట్టుబడ్డారని, నారావారిపల్లె సర్పంచ్ భర్తపై దాడి, భీమవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిపై గంజాయి బ్యాచ్ దాడులు చేశారని గుర్తుచేశారు. వరుస ఘటనలు జరుగుతున్నా చంద్రగిరి పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రాజేష్‌నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రంకేసిన కోడెగిత్తలు





కోడెగిత్తలను నిలవరిచేందుకు పోటీ పడుతున్న యువకులు

రామచంద్రాపురం, జనవరి 7: మండలంలోని నూతిగుంటపల్లె గ్రామంలో కోడెగిత్తలు రంకెలేశాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం జల్లికట్టు ఉత్సాహంగా జరిగింది. గ్రామస్థులతోపాటు పలువురు తమ కోడిగిత్తలను వారం నుంచే జల్లికట్టుకు సిద్ధం చేశారు. కోడెగిత్తల కొమ్ములకు దేవుళ్ల, రాజకీయ నాయకుల ఫొటోలతోపాటు విలువైన బహుమతులు కట్టి అల్లె వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వాటి వెనుక డప్పులు కొట్టడంతో అవి వీధుల్లోకి పరుగులు తీశాయి. నిలువరించేందుకు యువకులు జట్టుగా ఏర్పడి పోటీపడ్డారు. ఈ క్రమంలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. బహుమతులు అందుకున్న యువకులు కేరింతలు కొట్టారు. జల్లికట్టును తిలకించేందుకు వెదురుకుప్పం, చంద్రగిరి, కార్వేటినగరం మండలాల నుంచి భారీగా జనం తరలిరావడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. వచ్చిన వారికి గ్రామస్థులు భోజన సదుపాయం కల్పించారు. తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, ఆర్‌సీపురం సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మగారిపల్లెలో..



కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకుడు

పాకాల, జనవరి 7: మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ అమ్మగారిపల్లెలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను అలంకరించి కొమ్ములకు బహుమతులు కట్టి వీధుల్లో పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువత వాటి వెంట పరుగులు తీశారు. జల్లి కట్టు తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు అమ్మగారిపల్లెకు వచ్చి సందడి చేశారు.

పక్షులకన్నా హీనంగా చూస్తారా?

- కొరిడి-పేర్నాడు దారిలో తారు రోడ్డు నిర్మించండి
- లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తాం
- మరమ్మతులను అడ్డుకున్న పులికాట్ తీరంలోని గ్రామస్థులు




రోడ్డు మరమ్మతులను అడ్డుకుంటూ.. - కొరిడి-పేర్నాడు రోడ్డులో ధర్నా చేస్తున్న పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామస్థులు

సూళ్లూరుపేట, జనవరి 7: పక్షులకన్నా తమను హీనంగా చూస్తున్నారంటూ పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొరిడి- పేర్నాడు రోడ్డుకు చేస్తున్న మరమ్మతులను ఆదివారం వారు అడ్డుకుని, ధర్నా చేశారు. వారి మాటల్లోనే.. 'మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద నీటి ప్రవాహానికి పులికాట్ తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి-పేర్నాడు రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల మేర కోతకు గురైంది. దాంతో ఆర్టీసీ అధికారులు మా గ్రామాలకు బస్సును రద్దు చేశారు. దాదాపు నెల రోజులుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పిల్లలైతే బడులకు ఏడు కిలోమీటర్ల మేర నడిచి వెళుతున్నారు. ఇన్ని రోజులుగా మా సమస్యను పరిష్కరించాలని మొర పెట్టుకుంటూనే ఉన్నాం. ఎవరూ పట్టించు కోలేదు. ఇపుడు అధికార పార్టీ నాయకులు కొందరు ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి రోడ్డు పక్కనే ఉన్న మట్టిని తవ్వి గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. వేస్తే తారురోడ్డు వేయండి.. లేదంటే వెళ్లిపోండి. మా బాధలు మేము పడతాం. కూతవేటు దూరంలో ఉన్న షార్ కేంద్రానికి తారురోడ్డుకు అభ్యంతరం లేనప్పుడు మా గ్రామాలకు ఎందుకు ఉంది. పైగా పక్షుల పండగకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తారు. తీర ప్రాంత గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు లేవా? మమ్మల్ని అంత హీనంగా చూస్తారా..? తారు రోడ్డు నిర్మాణం జరగకుంటే ఎన్నికలను సైతం బహిష్కరిస్తాం. ఓటు వద్దు.. తారురోడ్డే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అక్కడున్న అధికార పార్టీ నాయకులు వెంటనే ఆర్టీసీ అధికారులకు చెప్పడంతో వారు బస్సును పంపించారు. దీనిపై గ్రామస్థులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా తాము చెబితే పట్టించుకోకుండా, అధికార పార్టీ నేతలు చెప్పిన వెంటనే పంపిస్తారా.. అంటూ ఆ బస్సును అడ్డుకుని వెనక్కి పంపించారు. దాదాపు గంటకుపైగా ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. చివరకు పోలీసులు వచ్చి గ్రామస్థులకు సర్దిచెప్పి, రాకపోకలు పునరుద్ధరించారు.

ఎస్ఎస్ ఉద్యోగులకు కార్మిక సంఘాల మద్దతు



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఎస్ఎస్ ఉద్యోగులు

తిరుపతి(విద్య), జనవరి 7: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఆదివారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆర్పీఐ దక్షిణభారత అధ్యక్షుడు అంజయ్య, సంఘ గౌరవాధ్యక్షుడు నాగవెంకటేశ్ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని నిర్ణయించాలని, 62 ఏళ్ల కాలానికి ఉద్యోగ విరమణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ ఎన్నికల ముందు మాట తీరుకు తదనంతరం వ్యవహరిస్తున్న విధానాలకు సంబంధం లేకుండా ఉందని విమర్శించారు. ఎస్ఎస్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. ఈ సమ్మెలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ లోకేష్‌బాబు, 34 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపినాథ్‌రెడ్డి, బీజేపీ తూర్పు మండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి

రేపు స్వర్ణముఖి పరిశీలన

శ్రీకాళహస్తి జనవరి 7: స్వర్ణముఖి నదిపై ఆనకట్టల నిర్మాణానికి అధ్యయనం చేసేందుకు జలవనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం సభ్యులు మంగళవారం శ్రీకాళహస్తికి రానున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముక్కంటి ఆలయాన్ని కేంద్ర బృందం దర్శించుకోనుందని వివరించారు.

రెడ్లమంతా టీడీపీలోనే ఉన్నాం

తేల్చిచెప్పిన గూడూరు నియోజకవర్గంలోని నేతలు



సమావేశంలో ప్రసంగిస్తున్న పాశిం సునీల్‌కుమార్

కోట, జనవరి 7: టీడీపీలోనే నాలుగు దశాబ్దాలుగా మా వర్గానికి గుర్తింపు వచ్చింది. తగిన పదవులు ఇచ్చారు. మేమెక్కడికీ వెళ్లలేదు. టీడీపీలోనే ఉన్నాం. బయట జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు' అంటూ రెడ్ల కుటుంబాల్లోని నేతలు తేల్చి చెప్పారు. కోట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం గూడూరు నియోజకవర్గస్థాయి రెడ్డి సామాజిక వర్గం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 600పైగా రెడ్ల కుటుంబాలు హాజరయ్యాయి. ఎన్టీఆర్.. పార్టీని స్థాపించిన నాటినుంచి ఇప్పటి వరకు టీడీపీలోనే రెడ్లకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు గూడూరు టిక్కెట్ ఇస్తే.. అత్యధిక మెజార్టీతో గెలిపించి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. వైసీపీలో రెడ్లను వాడుకున్నారేతప్ప సముచితస్థానం కల్పించలేదం లేదని చెప్పారు. అందువల్ల అక్కడున్న వారంతా కూడా టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటినుంచే ప్రచారంలోకి అన్ని కుటుంబాలు దిగుతాయని స్పష్టం చేశారు. అనంతరం పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. తాను దశాబ్దకాలంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి కార్యకర్త కష్టంలోనూ పాల్పంచుకుంటున్నానని చెప్పారు. తనపై ఇంతటి అభిమానం చూపించిన రెడ్ల కుటుంబాలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పడంతో ఒక్కసారిగా కరతాళ ధ్వనులతో భవనం మార్మోగింది. ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వరరాజులతోపాటు రాష్ట్ర నాయకులు ఈశ్వరవాక శివకోటారెడ్డి, శ్రావణిరెడ్డి, భారతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్.. ఇద్దరిపై కేసు

నాగలాపురం, జనవరి 7: నాగలాపురం మండల పరిధిలో ఆదివారం తిరుపతి విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడిలో 1200 కేజీల రేషన్ బియ్యం పట్టుబడింది. దీనికి సంబంధించి ఇద్దరిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. నాగలాపురం ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు..తిరుపతి విజిలెన్స్ ఎస్ఐ రామక్రిష్ణ నాయక్ తన సిబ్బందితో కలిసి ఎస్ఎస్ పురం వద్ద మినీ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంపై దాడులు నిర్వహించారు. 24 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. నగరి మండలం కీలపట్టుకు చెందిన బద్రి(22), నాగలా పురం తూర్పు దళితవాడకు చెందిన ఆదిమూలం (55)ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని నాగలాపురం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మునస్వామి, ఎస్ఎస్ పురం వీఆర్వో చంద్రశేఖర్‌లు నాగలాపురంలోని రేషన్ దుకాణానికి అప్పగించారు. కాగా నిందితులు కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని పెద్దపెద్ద హోటళ్లకు అధికధరకు విక్రయించేవారని తెలిసింది.

నృత్యం నయనానందకరం



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, జనవరి 7: తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం నయనానందకరంగా సాగింది. పలు అన్నమయ్య కీర్తనలకు తిరుపతికి చెందిన సాయినాథ్ బృందం తేజోమయి, కుషల, సహస్ర, మేఘన, హన్సిక, కుందన్ ఈష, షణ్ముఖ ప్రియ, భవిష్య ప్రదర్శించిన కూచిపూడి నృత్యం నగరవాసులను ఆకట్టుకుంది. శిల్పారామం ఏవో ఖాదరవల్లీ కళాకరులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విశేష ఆదరణ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

తిరుపతి రూరల్, జనవరి 7: తిరుపతిలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు విశేష ఆదరణ లభించింది. అన్నమయ్య కూడలి సమీపంలో గల యూత్ హాస్టల్లో ఈ ప్రదర్శన నిర్వహించారు. అమ్మకం, కొనుగోలుదారులందరికీ జొన్నరవ్వతో తయారు చేసిన ఉప్మా, వేరుశనగ చట్నీ అందించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహకులు మోహన్‌రెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి, గంగాధరం, నాగేశ్వరరావు మాట్లాడారు. పండ్లు, కూరగాయలు, నూనె, ధాన్యాల ఉత్పత్తిని సహజ సిద్ధంగా తయారు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువులతో పండించిన పంటలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. దేశవాళీ రకాలను కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఈ ప్రదర్శన సాగింది.

ఆరు స్టాల్స్ : తొలిసారిగా చేపట్టిన ఈ ప్రదర్శనకు తిరుపతి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రకృతి వ్యవసాదారులకు చెందిన ఆరు స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఎద్దు గానుగ ద్వారా తయారు చేసిన వేరుశనగ, నువ్వులు, కుసుమ, ఆవాలు నూనె, దేశవాళి రకం బియ్యం బహురూపి, నవారా, నల్ల బియ్యం వంటి రకాలు ప్రదర్శనలో ఉంచారు. అరటి హల్వా, కొర్రన్నం ప్రదర్శనకు ఉంచడమే కాక సందర్శకులందరికీ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో కుమార్, గోవర్దన్, ప్రకృతి వ్యవసాయ వేత్తలు, అమ్మకందార్లు పాల్గొన్నారు. ఇకపై ప్రతి నెలా తిరుపతిలో ఏదో ఒకచోట తప్పనిసరిగా ఈ ప్రదర్శన పెట్టాలని నిర్వాహకులు నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. 7981955245 నెంబరులో సంప్రదించవచ్చు.

సూళ్లూరుపేట వైసీపీలో అవే వర్గ విభేదాలు

- పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే వస్తున్నారని మున్సిపల్ చైర్మన్ డుమ్మా

సూళ్లూరుపేట, జనవరి 7: ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాక్షిగా సూళ్లూరుపేట వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ అధికారులు చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను ఆహ్వానించారు. కొంతకాలంగా అధికార పార్టీలో వర్గపోరు నడుస్తుండడంతో మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారు. అయితే ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కిలివేటి హాజరవుతున్నట్లు తెలియడంతో మున్సిపల్ చైర్మన్‌తోపాటు ఆయన వర్గమంతా డుమ్మా కొట్టారు. దీంతో మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితోపాటు వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, దామానెల్లూరు సహకార సంఘ అధ్యక్షుడు కళత్తూరు జనార్దన్ రెడ్డి, కళత్తూరు రామ్మోహన్ రెడ్డి తదితరులు హాజరుకాలేదు.

పండుగ వాతావరణంలో జన్ భాగీదారీ: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 7: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో జిల్లాలో జన్ భాగీదారీ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 8న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, డిబేట్, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 11వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలని తెలిపారు. 9 నుంచి 18వ తేదీ వరకు జిల్లాస్థాయిలో ఫొటో ఎగ్జిబిషన్, లఘు చిత్రాలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై సంతకాల సేకరణ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రక్తదాన శిబిరాలు, అంబేద్కర్ విగ్రహ ప్రాంతాల్లో శుభ్రం చేసి పూలమాలలు వేయడం, మానవహారం ఏర్పాటు చేయడం, 18న మారథాన్ రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య),జనవరి 7 : స్థానిక టీపీఎం పాఠశాలలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్(ఏపీపీఎస్‌టీఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మోహన్ నాయుడు, కె.మేఘనాథ్, ఉపాధ్యక్షులుగా పి.రవి, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్ బాబు, మహిళా కార్యదర్శులుగా ఎన్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనంజయ, ఎ.మోహన్, డివిజనల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర్, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి అభినందించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.



కొత్త కార్యవర్గ ప్రతినిధులకు నియామకపత్రాన్ని అందిస్తున్న మోహన్‌బాబు

తిరుపతిలో 22 మంది ఎస్‌ఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7 : తిరుపతిలో పనిచేస్తున్న 22 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.శ్రీనివాసులు, సి.చలపతి, ఎస్.గిరిబాబు, ఎం.ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌జీ.హేమాద్రి, ఎస్‌కే.మూర్తి, పి.గౌరిశంకర్‌లను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు. వై.రామకృష్ణను తిరుపతి నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఎం.పుర్యానాయక్, ఎం.నారాయణప్ప, సీహెచ్.సరస్వతి, ఎన్వీ.రెడ్డెప్ప, కె.ఎతిరాజులు, బి.రెడ్డి నాయక్, కె.బాలాజీ, వి.విశ్వనాథనాయుడు, కె.నిత్యానంద పిళ్లై, పి.సుమతి, పి.భువనేశ్వరి, పి.విజయలక్ష్మి, పీఎల్.వసుంధరాదేవి, ఎస్.శ్రీదేవిలను వీఆర్ సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శనివారం 68,793 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,489 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సెంట్రల్ వాటర్ రిసోర్స్ స్టాండింగ్ కమిటీ, ఎంపీ సంజీవ్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్లు సుందరం, ప్రభుదేవా, సినీనటి సురేఖవాణి, ప్రముఖ యాంకర్ లాస్య ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

హెచ్‌యూఎస్ జాతీయ సభను విజయవంతం చేయండి

తిరుపతి(విద్య), జనవరి 7 : కడపలోని శ్రీలలితాపంచాయతన దేవాలయం(చిన్మయమిషన్ ఎన్జీవో ప్లాట్స్)లో ఈనెల 9న ఉదయం 9 గంటలకు జరిగే హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ నాల్గవ మహాసభకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎక్కువసంఖ్యలో టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. విద్యారంగంలో సమస్యలు, పరిష్కారానికి చేపట్టాల్సిన అంశాలపై కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలిపారు.

● **సంక్రాంతి సెలవులపై హర్షం :** రాష్ట్రంలోని పాఠశాలలకు ఏపీ ప్రభుత్వం పది రోజుల పాటు సంక్రాంతి సెలవులను ప్రకటించడంపై హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై సంఘ ఆధ్వర్యంలో గతేడాది ఉన్నతాధికారులతో చర్చించామని తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి(విద్య), జనవరి 7: పాఠశాల దశ నుంచి విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలని ఐసర్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలచిన విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్ షో, ఆటల పోటీలు వంటివి నిర్వహించి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో తిరుపతికి చెందిన సిల్వర్‌ఓక్స్ పాఠశాల, చంద్రగిరి ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని జేవీవీ కార్యదర్శి రెడ్డెప్ప వివరించారు.

అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 7 : టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం ఓ హోటల్లో బలిజ ఉద్యోగులు, మేధావుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన, టీడీపీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్, చంద్రబాబు తమ స్వార్థం కోసం కాకుండా రాష్ట్ర ప్రజలను గెలిపించేందుకు ఉమ్మడిగా పోటీ చేస్తున్నారన్నారు. కులమతాల ప్రస్తావన లేని రాజకీయం చేయాలని, అన్ని సామాజిక వర్గాలతో కలసి ఉండాలని కోరారు. రాజకీయాల్లో మేధావులు కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ సురేంద్ర, బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాస్, ఆకేపాటి సుభాషిణి, పగడాల మురళి, ఆకుల వనజ, కృష్ణయ్య, ఆనంద్, మేమకుమార్, బాటసారి, యువరాజ్ పాల్గొన్నారు.

16న తిరుమలలో శ్రీవారి పార్వేటఉత్సవం

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం ఈనెల 16న ఘనంగా నిర్వహించనున్నారు. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్దజీయర్ మఠం నుంచి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్లి స్వామి వారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మలయప్పస్వామి, కృష్ణస్వామి పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవం సందర్భంగా శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఈ తరం ఉపాధ్యాయులకు సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7: ఈ తరం ఉపాధ్యాయులకు సావిత్రీబాయి పూలే ఆదర్శంగా నిలుస్తారని ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్యాం డేవిడ్ మోహన్ కుమార్ రాజు పేర్కొన్నారు. వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో సావిత్రీబాయి పూలే పేరుతో ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. వే ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పైడి అంకయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్యాం డేవిడ్ మాట్లాడుతూ మహిళలకు చదువు, సంపద, హక్కులు నిరాకరించిన పరిస్థితుల్లో విద్య ద్వారా సర్వం దక్కుతాయని భావించి విద్యా వ్యాప్తికి కృషి చేసిన దార్శనికురాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. తుడా కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు సావిత్రీబాయి పూలే పేరుతో అవార్డులు అందజేశారు.







మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రమణారెడ్డి - ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు - బహుమతి అందజేస్తున్న భువన్‌కుమార్, మనోహర్, గుండాల గోపీనాథ్, వెంకటేష్

సంస్కృతీ సంప్రదాయాలను మరువకూడదు

కలెక్టర్ వెంకటరమణారెడ్డి ● సందడిగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు

తిరుపతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ మరచిపోకూడదని, వాటి పరిరక్షణకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ వెంకట్రమణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి తుడా మైదానంలో ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్, ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన సౌజన్యంతో ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచే మహిళలు మైదానానికి చేరుకుని సృజనాత్మకతో ముగ్గులను తీర్చిదిద్దారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు అంటే గంగిరెద్దులు, ముగ్గులు, గొబ్బెమ్మలు గతంలో కనిపించేవని, ఇటీవల కాలంలో అవి బాగా తగ్గిపోయాయని అన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా ముగ్గులు వేసిన మహిళలకు ప్రత్యేక అభినందలు తెలిపారు. రాష్ట్రస్థాయికి వెళ్లే వారు మరింత నైపుణ్యంతో వేసి తిరుపతి జిల్లాకు ప్రథమ బహుమతి తీసుకురావాలని ఆకాంక్షించారు. న్యాయనిర్ణేతగా వచ్చిన శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ యువశ్రీ మాట్లాడుతూ ముగ్గులను చూస్తుంటే వారం రోజుల ముందే సంక్రాంతి సంబరాలు వచ్చినట్టు కనిపిస్తోందన్నారు. మరో నిర్ణేత ఎస్వీఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకురాలు తేజోవాణి మాట్లాడుతూ మరో తరానికి మన ఆచార, వ్యవహారాలను అందజేయాలంటే ఇలాంటి సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. లోకల్ స్పాన్సర్ సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సైకం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందించే ప్రథమ కర్తవ్యం అందరిపైనా ఉండాలన్నారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు జాతి సంస్కృతికి ప్రతిబింబమైన ముగ్గుల పోటీలను నిర్వహించే బాధ్యతను 20 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి ముందుకు తీసుకుపోతోందన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 87 మందికీ ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. బాలాజీ మొబైల్స్ అధినేత, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి వాచీలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ శుభమస్తు అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, తిరుపతి ఎడిషన్ ఇన్‌ఛార్జి సుధాకర బాబు, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏడీవీటీ మేనేజర్ ఈశ్వర్ నాయుడు, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



కన్సలేషన్ విజేతలు పి.శోభన చందు, ఖాదీకాలనీ, తిరుపతి - బీఎస్ మంజుల, పుత్తూరు - పి.ఉషారాణి, ఆర్సీ రోడ్డు, తిరుపతి - పి.భారతి, జీవకోన, తిరుపతి - వి.నీలమునిి, భవానీనగర్, తిరుపతి

ముగ్గుల పోటీల్లో నెగ్గిన వనితలు

- ఎం.విద్య, కొర్లగుంట, తిరుపతి - మొదటి బహుమతి
- కె.లోకేశ్వరి, భవానీనగర్, తిరుపతి - ద్వితీయ బహుమతి
- సీహెచ్.అనూరాధ, సత్యనారాయణపురం, తిరుపతి - తృతీయ బహుమతి

సమస్యలు పరిష్కరించే వరకు తగ్గేదేలే!



తిరుపతిలో జీవో ప్రతుల దహనం

● ఎస్మా జీవో ప్రతులను దహనం చేసిన అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 7 : తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేదే లేదని అంగన్వాడీ వర్కర్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఎస్మాను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదివారం తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం దీక్షా శిబిరం వద్ద జీవో కాపీలను దగ్ధం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ చిరుద్యోగులైన అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పదేపదే విన్నవించినా పట్టించుకోకపోగా ఇలా నిర్బంధాన్ని ప్రయోగించడం బాధాకరమని పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీల జీతాల్లో కోత పెట్టడం ద్వారా ప్రభుత్వం వారి పొట్ట కొట్టిందన్నారు. జీతాల్లో కోతలకు, ఎస్మా ప్రయోగాలకు బెదిరేది లేదన్నారు. వేతనాలు రూ.26వేలు చేసిన తర్వాతే అంగన్వాడీలు తిరిగి విధులకు వెళతారని స్పష్టం చేశారు. ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి.అంజయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, పద్మజ, నిర్మల మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, జి.బాలాజీ, పి.బుజ్జి, అంగన్వాడీ నేతలు నాగరాజమ్మ, జయప్రభ, సుజిత, గీత, ఎల్లమ్మ, వెంకటలక్ష్మి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

తిరుపతి(లీగల్), జనవరి 7: అంగన్వాడీ కార్మికులపై ఎస్మా చట్టం ప్రయోగించడం చట్టవిరుద్ధమని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పత్తికొండ మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మెను అణగదొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పనులకు పూనుకుంటోందని తెలిపారు. దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, లాయర్స్ యూనియన్ తరపున అంగన్వాడీలకు మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం తొలగింపునకు కుయుక్తులు

● అడ్డుకున్న టీడీపీ శ్రేణులు, అభిమానులు



నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణుల, ఎన్టీఆర్ అభిమానులు

తిరుపతి (రవాణా), జనవరి 7 : కరకంబాడి ప్రధాన రహదారిలోని తిమ్మినాయుడు పాళెం గ్రామం ముఖద్వారం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించేందుకు అధికార పార్టీ కుయుక్తులు పన్నుతోంది. గతనెల 29న రాత్రి తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు టీడీపీ శ్రేణులు, అభిమానుల కారణంగా బెడిసికొట్టాయి. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మళ్లీ విగ్రహాన్ని పక్కకు జరిపేందుకు ప్రయత్నాలు చేశారు. ఏకంగా మురుగుకాలువపై పెట్టేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను, నిర్మాణాన్ని కొంతవరకు పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని గమనించిన స్థానిక నేతలు కాయం వెంకటరత్నం, విజయ్, నరేష్ రెడ్డి, ధోని విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు కృష్ణయాదవ్‌కు తెలియజేశారు. నాయకులు అక్కడికి చేరుకుని నిలదీయడంతో తమకేమీ తెలియదన్నట్లు కూలీలు వెళ్లిపోయారు. ఈ విషయంలో తొలి నుంచి హైడ్రామా నడుస్తోంది. ఎవరిని అడిగినా తమకు తెలియదని చెబుతున్న నేపథ్యంలో విగ్రహాన్ని తొలగిస్తున్నది.. కాలువపై నిర్మాణాన్ని చేపట్టేది ఎవరన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు అడ్డంగా ఉందనే సాకుతో అధికార పార్టీ నాయకులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రోడ్డు సెంటర్ పాయింట్ వద్ద నిర్మాణాన్ని చేపట్టేందుకు టీడీపీ శ్రేణులు ప్రయత్నించగా అలిపిరి పోలీసులు అడ్డుకున్నారు. రాత్రికి రాత్రే విగ్రహాన్ని కాలువపై పెట్టేందుకు ప్రయత్నాలుచేస్తున్నారని సీఐకి టీడీపీ శ్రేణులు తెలుపగా అలాంటిదేమి జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అందరికీ ఆమోదయోగ్యమైన చోటే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహాన్ని కాలువపై ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నరసింహయాదవ్ మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడం మంచి పద్ధతి కాదని, ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించాలని చూస్తే నగరంలోని మిగతా విగ్రహాలను కాలువగట్టుపై ఏర్పాటు చేసేందుకు తాము పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు, తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, హేమంత్‌రాయల్, రవి మనోహరాచారి, యశ్వంత్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే యాత్ర 2 సినిమా

హుకిల్డ్ బాబాయ్‌ను ఈ సినిమాలో చూపిస్తారా.. ● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 7: ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టేందుకు యాత్ర 2 సినిమాను తీశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. ఇందులో హుకిల్డ్ బాబాయ్ అనే అంశం కూడా చూపించాలని కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ పథకానికైనా వైఎస్ఆర్ పేరు పెట్టారా అని ప్రశ్నించారు. ఏ పథకం చూసినా జగనన్న పేరుతో ఉన్నాయే తప్పా రాజశేఖర్‌రెడ్డి పేరు ఎక్కడా వినిపించిందా అని నిలదీశారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తండ్రి పేరును తెరమీదకు తెచ్చి కుటిల రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 14ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు నారావారిపల్లెలో మూడు బెడ్రూంల ఇల్లు మాత్రమే ఉందని, జగన్ సీఎం కాకముందే బెంగళూరు, హైదరాబాద్‌లో రూ.వందల కోట్ల విలువ చేసే ప్యాలెస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రగతి తిరోగమనం పట్టిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయే విధంగా చేసి, ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబాయ్‌ని హత్య చేసింది ఎవరు... అనే విషయాన్ని యాత్ర సినిమాలో చూపించాలన్నారు. యాత్ర 2 సినిమా ట్రైలర్ అభ్యంతరంగా ఉందని, సినిమాలో ఎక్కడైనా చంద్రబాబును కించపరిచేలా చూపిస్తే అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, నాయకులు వాసు, సందీప్, శ్రీనివాసయాదవ్, రంజిత్, గోపి, శ్రీరామ్, లోకేష్ రాయల్, శివ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ స్టాఫ్ పోటీలు



షీల్డ్ అందుకుంటున్న శివశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి - షీల్డ్ స్వీకరిస్తున్న ఉమెన్ విన్నర్స్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 7: ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. టెన్నిస్ డబుల్స్‌లో ప్రొఫెసర్ ఎం.శివశంకరరెడ్డి, డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. మెన్స్ విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబుల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) విజేతగా సీకాం డిగ్రీ కాలేజ్(కలికిరి) రన్నరప్‌గా నిలిచింది. టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజ్(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్(మెన్)లో టీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ(తిరుపతి) విజేతగా ఎస్వీయూ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. చదరంగంలో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా కుప్పం డిగ్రీ కాలేజీ(కుప్పం) రన్నరప్‌గా నిలిచింది. ఉమెన్స్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో ఎస్వీయూ(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. త్రోబాల్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి)గెలుపొందగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది.

బీసీలపై వైసీపీది కపటప్రేమ: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 7: వైసీపీ బీసీలపై కపటప్రేమ చూపుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు, యువతకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీఎం జగన్ బీసీలపై కపటప్రేమ చూపుతూ బీసీ సాధికారిత యాత్ర చేపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన, అవినీతి రాజ్యమేలుతోందన్నారు. అధికార పార్టీ నేతల దోపిడీతో సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారేగానీ, వాటికి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. టీడీపీతో బీసీలకు న్యాయం జరుగుతుందని, త్వరలోనే బీసీ చైతన్యయాత్ర ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, ఫైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, ప్రసాద్‌నాయుడు, ప్రసాద్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కేవీ నాయుడు, కృష్ణయ్య, సుజాతమ్మ, బాబు, రమణయ్య, చక్రపాణి, ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ మస్తాన్‌యాదవ్



వెంకటగిరి, జనవరి 7: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటగిరికి చెందిన డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్‌ను నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పెళ్లకూరు, జనవరి 7: మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం గ్రామానికి చెందిన బిట్రగుంట జనార్దన్‌రాజు(86) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... జనార్దన్‌రాజు కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి నడుచుకుంటూ జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, డిసెంబరు 7: తమిళనాడు నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య కథనం మేరకు సమాచారం.... చెన్నై వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న లారీని ఆర్టీసీ డిపో వద్ద తనిఖీ చేయగా 330బస్తాలు తమిళనాడు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు లారీని స్వాధీనం చేసుకొన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని విజిలెన్స్ రిజిస్ట్రార్ విజయకుమారు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జనవరి 7: వరదయపాళెం మండలం కొండూరు సొసైటీకి చెందిన స్వర్ణగా ఆదివారం సాయంత్రం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద 20 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

అదృశ్యమైన బాలిక మృతి

- హత్యగా భావిస్తున్న మృతురాలి తల్లిదండ్రులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చంద్రగిరి, జనవరి7: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో ఈనెల 2న అదృశ్యమైన ఆరేళ్ల బాలిక.. సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం శవమై కనిపించింది. పోలీసుల కథనం మేరకు... జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీ కోసం జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులను పదిరోజుల క్రితం కాంట్రాక్టర్ మధుకర్‌రెడ్డి పిలిపించారు. కార్మికులలో ఒకరైన రాజేష్‌నాయక్ తన కుమార్తె సోనికుమారి(6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకొంటూ కనిపించకుండా పోయిందని ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జగనన్న కాలనీ సమీప అటవీ ప్రాంతంలో సోనికుమారి మృతదేహం లభ్యమైంది. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. అయితే మృతురాలి తల్లి మాట్లాడుతూ తన కుమార్తె సోనికుమారి అదృశ్యమైన రోజు జార్ఖండ్‌కు చెందిన బాలకిషోర్‌పై అనుమానం వచ్చి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించామని, అయితే పోలీసులు బాలకిషోర్‌ను వదిలిపెట్టేసారని చెప్పారు. గత గురువారం బాలకిషోర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం వలనే తన కుమార్తె హత్యకు గురైందని వెల్లడించారు.





సోనికుమారి (ఫైల్ ఫొటో) - విలపిస్తున్న మృతురాలి తల్లి

బాలిక మృతదేహాన్ని పరిశీలించిన పులివర్తి నాని

టీడీపీ నేత పులివర్తి నాని ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి బ్యాచ్ వలనే ఈ దారుణం చోటు చేసుకుందని, చంద్రగిరి నియోజకవర్గం గంజాయి హబ్‌గా మారిందన్నారు. గంజాయి మత్తులోనే అభంశుభం తెలియని బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. గతంలో చంద్రగిరిలో ఓ బాలికకు గంజాయి విక్రయిస్తూ ఎమ్మెల్యే బ్యాచ్ పట్టుబడ్డారని, నారావారిపల్లె సర్పంచ్ భర్తపై దాడి, భీమవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిపై గంజాయి బ్యాచ్ దాడులు చేశారని గుర్తుచేశారు. వరుస ఘటనలు జరుగుతున్నా చంద్రగిరి పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రాజేష్‌నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



పులివర్తి నానికి తన ఆవేదన చెబుతున్న మృతురాలి తండ్రి రాజేష్‌నాయక్



అనుమానితుడు బాలకిషోర్

ప్రజలను మభ్యపెట్టేందుకే యాత్ర 2 సినిమా

హూకిల్డ్ బాబాయ్‌ను ఈ సినిమాలో చూపిస్తారా..

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 7: ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టేందుకు యాత్ర 2 సినిమాను తీశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. ఇందులో హూకిల్డ్ బాబాయ్ అనే అంశం కూడా చూపించాలని కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ పథకానికైనా వైఎస్‌ఆర్ పేరు పెట్టారా అని ప్రశ్నించారు. ఏ పథకం చూసినా జగనన్న పేరుతో ఉన్నాయే తప్పా రాజశేఖర్‌రెడ్డి పేరు ఎక్కడా వినిపించిందా అని నిలదీశారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తండ్రి పేరును తెరమీదకు తెచ్చి కుటిల రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు నారావారిపల్లెలో మూడు బెడ్రూంల ఇల్లు మాత్రమే ఉందని, జగన్ సీఎం కాకముందే బెంగళూరు, హైదరాబాద్‌లో రూ.వందల కోట్ల విలువ చేసే ప్యాలెస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రగతి తిరోగమనం పట్టిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయే విధంగా చేసి, ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబాయ్‌ని హత్య చేసింది ఎవరు... అనే విషయాన్ని యాత్ర సినిమాలో చూపించాలన్నారు. యాత్ర 2 సినిమా ట్రైలర్ అభ్యంతరంగా ఉందని, సినిమాలో ఎక్కడైనా చంద్రబాబును కించపరిచేలా చూపిస్తే అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, నాయకులు వాసు, సందీప్, శ్రీనివాసయాదవ్, రంజిత్, గోపి, శ్రీరామ్, లోకేష్ రాయల్, శివ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి (విద్య), జనవరి 7: స్థానిక టీపీపీఎం పాఠశాలలో ఏపీ ఫిజికల్‌సైన్స్ టీచర్స్ ఫోరమ్ (ఏపీపీఎస్‌టీఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మోహన్ నాయుడు, కె.మేఘనాథ్, ఉపాధ్యక్షులుగా పి.రవి, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్‌బాబు, మహిళా కార్యదర్శులుగా ఎన్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనంజయ, ఎ.మోహన్, డివిజనల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి అభినందించారు.

పక్షులకన్నా హీనంగా చూస్తారా?

- కొరిడి-పేర్నాడు దారిలో తారు రోడ్డు నిర్మించండి
- లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తాం
- మరమ్మతులను అడ్డుకున్న పులికాట్ తీరంలోని గ్రామస్తులు



రోడ్డు మరమ్మతులను అడ్డుకుంటున్న జనం



కొరిడి-పేర్నాడు రోడ్డులో ధర్నా చేస్తున్న పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామస్తులు

సూళ్లూరుపేట, జనవరి 7: పక్షులకన్నా తమను హీనంగా చూస్తున్నారంటూ పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొరిడి- పేర్నాడు రోడ్డుకు చేస్తున్న మరమ్మతులను ఆదివారం వారు అడ్డుకుని, ధర్నా చేశారు. వారి మాటల్లోనే.. 'మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద నీటి ప్రవాహానికి పులికాట్ తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి-పేర్నాడు రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల మేర కోతకు గురైంది. దాంతో ఆర్టీసీ అధికారులు మా గ్రామాలకు బస్సును రద్దు చేశారు. దాదాపు నెల రోజులుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పిల్లలైతే బడులకు ఏడు కిలోమీటర్ల మేర నడిచి వెళుతున్నారు. ఇన్ని రోజులుగా మా సమస్యను పరిష్కరించాలని మొర పెట్టుకుంటూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇపుడు అధికార పార్టీ నాయకులు కొందరు ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి రోడ్డు పక్కనే ఉన్న మట్టిని తవ్వి గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. వేస్తే తారురోడ్డు వేయండి.. లేదంటే వెళ్లిపోండి. మా బాధలు మేము పడతాం. కూతవేటు దూరంలో ఉన్న షార్ కేంద్రానికి తారురోడ్డుకు అభ్యంతరం లేనప్పుడు మా గ్రామాలకు ఎందుకు ఉంది. పైగా పక్షుల పండగకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తారు. తీర ప్రాంత గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు లేవా? మమ్మల్ని అంత హీనంగా చూస్తారా..? తారు రోడ్డు నిర్మాణం జరగకుంటే ఎన్నికలను సైతం బహిష్కరిస్తాం. ఓటు వద్దు.. తారురోడ్డే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అక్కడున్న అధికార పార్టీ నాయకులు వెంటనే ఆర్టీసీ అధికారులకు చెప్పడంతో వారు బస్సును పంపించారు. దీనిపై గ్రామస్తులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా తాము చెబితే పట్టించుకోకుండా, అధికార పార్టీ నేతలు చెప్పిన వెంటనే పంపిస్తారా.. అంటూ ఆ బస్సును అడ్డుకుని వెనక్కి పంపించారు. దాదాపు గంటకుపైగా ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. చివరకు పోలీసులు వచ్చి గ్రామస్తులకు సర్దిచెప్పి, రాకపోకలు పునరుద్ధరించారు.

ఎస్మాతో బెదిరించలేరు



జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పుత్తూరు అర్బన్, జనవరి 7: ఎస్మాతో అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ స్పష్టం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా 27వ రోజు ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 2ను దహనం చేసి నిరశన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌కు కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఏమాత్రం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అహంకార పూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. అంగన్వాడీలను అత్యవసర సేవల విభాగంలోకి తీసుకువస్తూ జీవో నెంబర్ 2 విడుదల చేయడం ప్రభుత్వ పెద్దల నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. సీఎం జగన్ ఇలాగే వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో అన్ని కార్మిక సంఘాలు ఏకమై తగిన బుద్ధి చెబుతామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయకుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, మోహన్ లక్ష్మీ, లలిత, అన్నపూర్ణ, గంగులమ్మ, కృష్ణవేణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన గెలుపు తథ్యం



జనసేనలో చేరిన యువతతో పార్టీ నాయకులు

పుత్తూరు టౌన్, జనవరి 7: రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపు తథ్యమని నగరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మెరుపుల మహేష్ పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు పట్టణంలోని జనసేన కార్యాలయంలో మండల అర్బన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం జనసేనలో స్థానిక యువతకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగార్జున, పుత్తూరు మండలాధ్యక్షుడు జగదీశ్వర్‌రాజు, ఐటీ కోఆర్డినేటర్ అశోక్, రూరల్ అధ్యక్షులు వెంకటముని, ప్రధాన కార్యదర్శులు భాను ప్రకాష్, దిలీప్, చైతన్య సాగర్, మోనిష్, సాయి, సురేష్, చందు, శివకుమార్, శ్రీను, రాజేష్, బుజ్జి, దీపక్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

విజయకాంత్‌కు నివాళి



విజయకాంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 7: డీఎండీకే పార్టీ వ్యవస్థాపకుడు, సినీ నటుడు విజయకాంత్‌కు మంత్రి రోజా, ఆమె భర్త శెల్వమణి దంపతులు నివాళులర్పించారు. ఆదివారం చెన్నైలోని విజయకాంత్ స్వగృహంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ విజయకాంత్ రాజకీయ, సినీ రంగాల్లో తనదైన శైలిలో రాణించారని అన్నారు.

మండల యాదవ సంఘ అధ్యక్షుడిగా రమేష్ యాదవ్





రమేష్ యాదవ్, వెంకటరమణ

వడమాలపేట, జనవరి 7: శ్రీకృష్ణ యాదవ సంఘం వడమాలపేట మండల అధ్యక్షుడిగా వాసాల రమేష్ యాదవ్(బట్టికండ్రిగ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు గడ్డం సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా సదాశివయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కార్యదర్శిగా పరుశురాం, ఉపకార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా చిన్నబ్బ, కార్యనిర్వాహక సభ్యులుగా భరత్‌కుమార్, అంజేరయ్య, పురుషోత్తం, ఎన్.పురుషోత్తం ఎన్నికయ్యారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

పుత్తూరు అర్బన్, జనవరి 7: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని గేటు పుత్తూరులోని గుండ్ల పుత్తూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక, అవినీతి పాలనతో రాష్ట్రంలో సర్వనాశనమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రోడ్లు కూడా వేయలేని దద్దమ్మ ప్రభుత్వం జగన్ సర్కార్ అని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో పన్నులు, ధరల మోత తప్ప అభివృద్ధి పూర్తిగా అడుగంటిపోయిందని ధ్వజమెత్తారు. మళ్లీ రాష్ట్రానికి, ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి మంచిరోజులు రావాలంటే రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పాలన అవశ్యమన్నారు. ప్రతి కుటుంబం సగర్వంగా తలెత్తుకుని జీవించేలా ఆరు గ్యారెంటీలకు చంద్రబాబునాయుడు రూపకల్పన చేశారని, రానున్న టీడీపీ - జనసేన ప్రభుత్వంలో అమలు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. నగరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించాలంటే టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. అనంతరం ఆరు గ్యారెంటీలపై ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో పాటు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి ఎస్కే కేశవ, బూత్ కన్వీనర్ మోహన్, నాయకులు మునిరాజాచ్చారి, మహ్మద్ నబీ, కిష్టప్ప మొదలియార్, లీలా ప్రసాద్, ప్రసాద్, జ్యోతి, శీనా, రేవతి, భూషణం, సురేష్, శివ, జగదీష్, శారద, మోహన, భాగ్య, అరుణ, ఇందుమతి, రాధా, రాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

పుత్తూరు అర్బన్, జనవరి 7: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో భాగంగా నిరశన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలు పైబడి విధులు నిర్వహించిన ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వర్తింప చేయాలని కోరారు. తమ డిమాండ్లు ప్రభుత్వ పరిష్కరించాలని, అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరశన కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు అభినందనీయం

పుత్తూరు టౌన్, జనవరి 7: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మార్పు బాలకృష్ణమ్మ అభినందనీయమని అఖల భారత ఫెడరేషన్ ప్రధాన కార్యర్శి సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం బాలకృష్ణమ్మ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఒక్క తాటిపైకి తీసుకుని వచ్చి, వారి సమస్యల పరిష్కారం కోసం బాలకృష్ణమ్మ చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కర్ రాజు, జయచంద్రనాయుడు, నాయకులు చెంగల్‌రాయ మందడి, గోవిందయ్య, నాధముని, వెంకటుముని, నరేంద్ర, సురేష్, మధు, మావుళ్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల వార్షికోత్సవం

పుత్తూరు, జనవరి 7: పుత్తూరు విద్యుత్ డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. 75 ఏళ్లు దాటిన 9మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డిస్కమ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ గౌరవ అధ్యక్షుడు కేఎస్ఎన్ చారి, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వేణుగోపాల్ అయ్యర్, పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి భాస్కర్, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు భాస్కరాజు పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్వహణ అధ్వానం



వసతి గృహం విద్యార్థులతో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

నారాయణవనం, జనవరి 7: మండల పరిధిలోని బాలుర వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయని టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పాలమంగళంలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వసతి గృహంలో కనీస వసతులు లేవన్నారు. కిటికీలు సరిగ్గా లేవని, నేల పూర్తిగా గచ్చులు లేచిపోయిందని, నీళ్ల, విద్యుత్ సౌకర్యాలు కూడా అధ్వానంగా ఉన్నాయని, వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వసతి గృహంలోని సమస్యలను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఐటీడీపీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, రుద్రయ్య ఉన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సీఐ అంజూయాదవ్ బదిలీ



శ్రీకాళహస్తి జనవరి 7: శ్రీకాళహస్తి 1టౌన్ సీఐగా పనిచేస్తున్న అంజూ యాదవ్ తిరుపతి ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరోకు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు సీఐలను పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఆదివారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆమె ను తిరుపతికి బదిలీ చేశారు. 2022 మే 26వ తేదీన శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐగా అంజూ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆమె శ్రీకాళహస్తి నుంచి రిలీవ్ కానున్నారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి జనవరి 7: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన శ్రీనివాసరావు రూ.1లక్ష విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సమేతంగా బుధవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు పరిపాలన భవనంలో ఆలయ ఏఈఓ సతీష్, పీఆర్వో నాగభూషణంను కలిసి నగదు అందజేశారు.

ఘనంగా గొబ్బెమ్మ ఊరేగింపు



శ్రీకాళహస్తి జనవరి 6: గొబ్బెమ్మ ఊరేగింపు గురువారం చతుర్మాడ వీధుల్లో ఘనంగా జరిగింది. ధనుర్మాసం పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలోని అలం కార మండపంలో గొబ్బెమ్మ ఉత్సవ మూర్తిని విశేషంగా అలంక రించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి ఊరేగింపు ప్రారంభించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన



శ్రీకాళహస్తి జనవరి 7: శ్రీకాళహస్తి మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం వంటా వార్పుతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. పుర పాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం 5వ రోజు కార్మికుల నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా వంటవార్పుతో తమ ఆక్రందన తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనామాల గురవయ్య మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో మున్సిపల్ కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ నియోజకవర్గ అధ్యక్షులు మురళి, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపి, మున్సిపల్ కార్మిక నాయకులు హరి, జాన్, వెంకటేష్, కొండమ్మ, శారదమ్మ, మురళీకృష్ణ, మధు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

శ్రీకాళహస్తి జనవరి 7: ఉద్యోగులకు మధ్యంతర భృతిని వెంటనే అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మురళి డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా దగా చేసిందన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పెండింగ్ పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, సభ్యులు హరి, గిరిబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించండి

శ్రీకాళహస్తి, జనవరి 7: తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం రాత్రి నీరజ అనే స్టాఫ్‌నర్సు మెడలోని బంగారు గొలుసు లాక్కోవడానికి ఇద్దరు దుండగలు యత్నించడంతో ఆమె రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పురరావృతం కాకుండా ఆరోగ్య కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీతో రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహు కేతు పూజలు చేయించుకుంటున్న దర్శకులు రాఘవేంద్రరావు, ఆలయం వద్ద సినీ నటి సురేఖావాణి

శ్రీకాళహస్తి జనవరి 7: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. స్థానిక టీడీపీ నాయకులు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆయన రాహు కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా సినీనటి సురేఖ వాణి ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు.

'స్వామి నీ నోటి దూల నీకే చేటు'

పిచ్చాటూరు, జనవరి 7: ' స్వామీ నీ నోటి దూల మాటలతో నీకే చేటు జరుగుతుంది' అని తిరుపతి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై మండి పడ్డారు. ఆదివారం వేలూరులోని అయన స్వగృహంలోని మాట్లాడారు. వైఎస్ఆర్ మరణం వెనుక సోనియా, చంద్రబాబుల హస్తం ఉందని ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు డిప్యూటీ సీఎంగా ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబును విమర్శించే స్థాయి, అర్హత నీకు లేవని తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

10న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి జనవరి 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10వ తేదీన హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో సుబ్బయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన ఉద్యోగులు ,సిబ్బంది నిబంధనల ప్రకారం సకాలంలో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.

పరశురామేశ్వరుడి సేవలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

ఏర్పేడు, జనవరి 7: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని ఆది వారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆలయానికి ప్రసాదాల నిర్వహణకు రూ.5వేలు విరాళం అందించారు.

మానవసేవే మాధవసేవ



వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి జనవరి 7: మానవసేవే మాధవసేవ అని యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రెసిడెంట్ హేమకుమార్ అన్నారు. ఇటీవల ఆయన తల్లి పుష్పమ్మ మరణించారు. ఆమె జ్ఞాపకార్థం ఆదివారం శ్రీకాళహస్తి పట్టణం సన్నిధి వీధిలోని వృద్ధాశ్రమం, తొట్టంబేడు మండలం శివనాథ పాళెంలోని అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షరీఫ్, నారాయణ, శ్రీనివాసులు, చంద్ర, సురేష్, పార్థసారథి, ప్రదీప్ పాల్గొన్నారు.

యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



గాయపడిన మోచి

శ్రీకాళహస్తి జనవరి 7: గుర్తు తెలియని వ్యక్తులు యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ నగర్‌లో జరిగింది. పట్టణానికి చెందిన మోచి(25) ఎన్టీఆర్‌నగర్‌లో వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. చికిత్స నిమిత్తం యువకుడు ప్రభుత్వాస్పత్రిలో చేరాడు.

నేడు అయోధ్య అక్షింతల పంపిణీ

శ్రీకాళహస్తి జనవరి 7: శ్రీకాళహస్తిలో సోమవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

లబ్ధిదారుల వద్దకే పథకాలు: ఎమ్మెల్యే



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి జనవరి 7: వైసీపీ పాలనలో ఎలాంటి మధ్యవర్తులు లేకుండా లబ్ధిదారుల వద్దకే నేరుగా పథకాలు చేరుతున్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పెన్షన్ కానుక కార్యక్రమం నిర్వహించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలకు చెందిన లబ్ధిదారులకు పెరిగిన పింఛను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు బర్రె హేమభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బృందమ్మ పరామర్శ

శ్రీకాళహస్తి జనవరి 7: మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ ఆదివారం నివాళులర్పించారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బాబురెడ్డి తల్లి ఇటీవల మృతి చెందారు. బాబు రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే దక్షిణ కైలాసనగర్ కాలనీకి చెందిన మోహన్‌రావు ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు.

చంద్రశేఖర్‌కు డాక్టరేట్ ప్రదానం



ఇస్రో చైర్మన్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న చంద్రశేఖర్

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 7: బుచ్చినాయుడు కండ్రిగ మండలం గాజులపెళ్లూరు గ్రామ దళితవాడకు చెందిన కె.చంద్రశేఖర్‌కు జేఎన్‌టీయూ హైదరాబాద్ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ నెల 5న జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కట్టా నరసింహారెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్నారు. చంద్రశేఖర్ వాయు వుతో పనిచేసే యంత్రం బ్లేడుపై ఉష్ణ అవరోధం, పూత సర్వోత్తమీకరణం, పనీతీరు, మూల్యాం కనం అనే విషయంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందించారు. ప్రస్తుతం ఈయన ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీస్ ఫ్యాకల్టీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇదేం అన్యాయం...?

ఎస్మాపై భగ్గుమన్న అంగన్వాడీలు
కళ్లకు గంతలతో నిరసన



శ్రీకాళహస్తిలో, సత్యవేడులో కళ్లకు గంతలతో నిరసన, పిచ్చాటూరులో మెడలో పూలమాలలు ధరించి నిరసన

శ్రీకాళహస్తి జనవరి 7: న్యాయపరమైన హక్కుల కోసం పోరాడుతున్న వారిపై ఎస్మా ప్రయోగిస్తారా.. ఇదేం అన్యాయం అంటూ అంగ న్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద 27వ రోజు నిరవధిక సమ్మెను రిలే దీక్షతో కొనసాగించారు. ఇందులో భాగంగా ఆదివారం రోజు అంగ న్వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్లు గంతలుగా కట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగంపై జిల్లా రైతు సంఘం సీఐటీయూ అధ్యక్షుడు దాసరి జనార్ధన్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. అంగన్వాడీలు ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

సత్యవేడు: సత్యవేడులో ఐసీడీఎస్ కార్యాల యం వద్ద అంగన్వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్మా ప్రయోగంపై మండిపడ్డారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్వా డీలు కాంతమ్మ, భారతి, ఝాన్సీ, నాగరాజు, స్వర్ణలత, గీత, చందామలై, మంజుల, హేమా వతి, సీఐటీయూ నాయకుల బాషా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో జనసేన పటిష్టం: వినుత



సమావేశంలో మాట్లాడుతున్న వినుత

శ్రీకాళహస్తి, జనవరి 7: శ్రీకాళహస్తిలో జనసేన క్యాడర్‌ను పటిష్టంగా నిర్మించామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత తెలిపారు. పట్టణంలోని రోటరీ క్లబ్‌లో ఆదివారం జనసేన బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గంలో 1500 మందితో బూత్ కమిటీలను నియమించామని చెప్పారు. ప్రతి 50 ఓట్లకు ఒక జనసేన వలంటీరును నియమించినట్లు వెల్లడించారు. అలాగే ప్రతి పంచాయతీలో పది మందితో కో-ఆర్డినేటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు జనసేన సిద్ధంగా ఉందన్నారు. అధికార పార్టీ దౌర్జన్యాలను జనసేన అడుగడుగునా ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, రామయ్య, కిరణ్ కుమార్, తోట గణేష్, పేట చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్.. ఇద్దరిపై కేసు



పట్టుబడిన రేషన్ బియ్యం

నాగలాపురం, జనవరి 7: నాగలాపురం మండల పరిధిలో ఆదివారం తిరుపతి విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడిలో 1200 కేజీల రేషన్ బియ్యం పట్టుబడింది. దీనికి సంబంధించి ఇద్దరిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. నాగలాపురం ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు..తిరుపతి విజిలెన్స్ ఎస్ఐ రామక్రిష్ణ నాయక్ తన సిబ్బందితో కలిసి ఎస్ఎస్ పురం వద్ద మినీ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంపై దాడులు నిర్వహించారు. 24 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. నగరి మండలం కీలపట్టుకు చెందిన బద్రి(22), నాగలా పురం తూర్పు దళితవాడకు చెందిన ఆదిమూలాం (55)ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని నాగలాపురం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మునస్వామి, ఎస్ఎస్ పురం వీఆర్వో చంద్రశేఖర్‌లు నాగలాపురంలోని రేషన్ దుకాణానికి అప్పగించారు. కాగా నిందితులు కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని పెద్దపెద్ద హోటళ్లకు అధికధరకు విక్రయించేవారని తెలిసింది.

టీడీపీతోనే కాపుల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కాపు నేతలు

శ్రీకాళహస్తి జనవరి 7: టీడీపీతోనే కాపుల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ నేతలు వెల్లడించారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్లో ఆదివారం టీడీపీ కాపు నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలు గున్నర సంవత్సరాలుగా శ్రీకాళ హస్తిలో కాపు భవనం నిర్మిం చని ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి మూడు నెలల్లో పూర్తిచేస్తామని ప్రకటించడం హాస్యాస్పద మన్నారు. వైసీపీ లోని కొందరు కాపు నాయకులు వ్యవహరిస్తున్న తీరు బాధాకర మన్నారు. గతంలో టీడీపీలో కీలక పదవులు అనుభవించిన వారు నేడు విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. కాపు సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సీనియర్ నాయకులు మండల సుబ్రహ్మణ్యం, వజ్రం కిషోర్, కిట్టు, యశ్వంత్, యాదగిరి, అనిల్, హేమంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు



పోలీసుల అదుపులో ఉన్న పందెపురాయళ్లు

వరదయ్యపాళెం, జనవరి 7: వరదయ్యపాళెం మండ లంలోని బత్తలవల్లం సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1030 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం, పోలీసులు హరి, కిరణ్, సుధీర్ పాల్గొన్నారు.

రేపు స్వర్ణముఖి పరిశీలన

శ్రీకాళహస్తి జనవరి 7: స్వర్ణముఖి నదిపై ఆనకట్టల నిర్మాణానికి అధ్యయనం చేసేందుకు జలవనరుల పార్ల మెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం సభ్యులు మంగళ వారం శ్రీకాళహస్తికి రానున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముక్కంటి ఆలయాన్ని కేంద్ర బృందం దర్శించుకోనుందని వివరించారు.

ముదిరాజులకు అండగా ఉంటాం

శ్రీకాళహస్తి జనవరి 7: ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజలకు వైసీపీ అండగా ఉంటుందని శ్రీకాళ హస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం ముదిరాజ్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజు సామాజిక వర్గ నాయకులకు వైసీపీ ఇచ్చిన పదవులను వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయ, చంద్రశేఖర్, తిమ్మరసు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ



పిచ్చాటూరు, జనవరి 7: డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో లారీ ఓ ఇంటిపైకి దూసుకెళ్లింది. తిరుపతి -చెన్నై జాతీయ రహదారిలోని అప్పంబట్టు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. చెన్నై నుంచి తిరుపతికి వస్తున్న ఓ లారీ గ్రామానికి చెందిన నెహ్రూ ఇంటివైపు దూసుకెళ్లింది. సరిగ్గా గోడ వద్ద ఆగిపోయింది. ఇంటికి లోపలున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఓ మోటారు సైకిల్ మాత్రం నుజ్జునుజ్జయింది.

టిప్పరు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి జనవరి 7: టిప్పరు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో సుబ్రహ్మణ్యం (63) అనే రైతు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కాసా గార్డెన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. తొట్టంబేడు మండలం కొత్తకండ్రిక గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రైతు. పశువులకు దాణా కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కాసా గార్డెన్ వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహ దారిపై రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన మట్టి టిప్పర్ ఆయన వాహనాన్ని ఢీకొంది. గాయపడిన ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కనబడుట లేదు



వై.తులసీరామ్ (వయస్సు 15 సం॥లు)

పై ఫోటోలో ఉన్న వ్యక్తి 01-01-2024 వ తేది నుండి (తిరుపతి, ఆటోనగర్) కనబడుటలేదు. ఆచూకి తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

తండ్రి : వై.వెంకటేష్

సంప్రదించండి : 95734 40521, 9052937742, 9948017560

వసతి గృహాలను గాలికొదిలేసిన ప్రభుత్వం



హాస్టల్‌ను సందర్శించిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

సత్యవేడు, జనవరి 7: సంక్షేమ వసతి గృహాలను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ విమర్శించారు. నారాయణవనం మండలం పాల మంగళం నార్త్‌లోని బాలుర వసతి గృహాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరిగిపోయిన తలుపులు, వేలాడుతున్న కిటికీలు, గుంతలమయమైన ఫ్లోర్, పెచ్చులూడి పడుతున్న గదుల్లో భయంతో విద్యార్థులు గడుపుతున్నారని తెలియజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ముసుగులో భూ కబ్జాలు



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

శ్రీకాళహస్తి జనవరి 7: పేదల ముసు గులో వైసీపీ నాయకులు భూకబ్జాలు చేస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిపాకుల గోపీనాథ్ ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాల యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూని యర్ కళాశాల స్థలాన్ని అధికార పార్టీ నాయకులు రాత్రికి రాత్రి ఎందుకు చదును చేశారని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ నిరసన తెలిపిన తరువాత పేదల ఇళ్ల స్థలాల కోసం సిద్ధం చేశామని చెప్పుకోవడం ఒక డ్రామా అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వ డాన్ని టీడీపీ ఎప్పుడూ అడ్డుకోదన్నారు. అయితే ప్రభుత్వ కళాశాల స్థలాన్ని ఇళ్ల కోసం ఎలా కేటాయిస్తారని నిలదీశారు. నిరుప యో గంగా ఉన్న వేలాది టిడ్కో ఇళ్లను ఇవ్వొ చ్చని హితువు పలికారు. పేదల ముసు గులో కళాశాల భూమిని మింగేసేందుకు వైసీపీ కుట్రలు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దారా పండు, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.